క్లుప్తంగా

శాకాంబరి అలంకారంలో చౌడేశ్వరి



సదుం: మండలంలోని జాంౖడపేట రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆషాఢ మాసం శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, విశేషాలంకారం చేశారు. వివిధ రకాల కూరగాయలతో శాకాంబరిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

మలేరియాపై అప్రమత్తం



నీళ్లకుంటలో నిర్వహిస్తున్న ర్యాలీ

పలమనేరు: సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో ప్రజలు మలేరియా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక సబ్ యూనిట్ అధికారి జయశంకర్ విజ్ఞప్తి చేశారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీలోని నీళ్లకుంటలో ఆయన మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, వ్యక్తిగత శుభ్రతను పాటించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

భక్తులతో మర్యాదగా మసలుకోండి

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ దర్శనార్థం వచ్చే భక్తులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని ఆలయ ఈఓ ఏకాంబరం అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఈఓ సిబ్బందితో ఆలయ సమీక్షించారు. ఆషాఢమాసం రాకతో బోయకొండకు నెలంతా భక్తుల రద్దీ ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని భక్తులకు సరైన సేవలు అందివ్వాలన్నారు. సిబ్బంది అందరూ విధులకు విధిగా యూనిఫాం ధరించి హాజరు కావాలని, షిఫ్ట్ పద్ధతిలో కాకుండా నిర్దేశిత సమయానికి రావాలని ఆదేశించారు. విధి నిర్వహణలో సెల్‌ఫోన్లు వాడరాదని, నిర్ణయించిన ప్రదేశాల్లో విధులు నిర్వర్తించి ఆలయానికి మంచి పేరు తేవడానికి కృషి చేయాలని కోరారు.

వారాహిమాత పారాయణం



ప్రత్యేక అలంకరణలో వైష్ణవీదేవి

చౌడేపల్లె: మండలంలో పుదిపట్లలోని శ్రీ వైష్ణవీదేవి ఆలయంలో శుక్రవారం వారాహి మాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సౌందర్య లహరి పారాయణం చేశారు. అమ్మవారిని ఆలయ అర్చకురాలు శ్రావణి సుందరంగా అలంకరణ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు హాజరై పారాయణం చేశారు. ఆలయ నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేయడంతోపాటు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

విద్యార్థినులకు రక్తపరీక్షలు

యాదమరి: మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో శుక్రవారం మండల వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ విద్యార్థినులకు రక్తపరీక్షలు నిర్వహించారు. 70 మంది విద్యార్థినులకు బ్లడ్ గ్రూప్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. అనంతరం విద్యార్థినులకు విటమిన్, కాల్షియం మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాసమూర్తి, శాంతమ్మ, భానుప్రియ, సరస్వతి, సురేందర్ రెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా రవిశేఖర్ బాధ్యతల స్వీకరణ



డీఈఓకు నియామకపత్రం ఇస్తున్న రవిశేఖర్

చిత్తూరు కలెక్టరేట్: డీఈవో కార్యాలయ నూతన సూపరింటెండెంట్‌గా రవిశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డీఈవో వరలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి నియామక ఉత్తర్వులను అందజేశారు. సూపరింటెండెంట్‌తో డీఈవో మాట్లాడుతూ, బాధ్యతతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇచ్చే కసరత్తు ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా విధులు నిర్వర్తించాలన్నారు ఆయనకు కార్యాలయంలోని సహచర సూపరింటెండెంట్లు స్వర్ణలత, నందకుమార్, రమేష్, ఇతర సిబ్బంది మురళి, గోపాల్, సాయి, ఆనంద్, జయప్రకాష్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం!

- మామిడి తోటల్లో ఎక్కువగా సాగు
- ఒకే పంటకాలంలో రెండు, మూడు పంటలతో రెట్టింపు ఆదాయం
- భారీగా తగ్గనున్న పంట పెట్టుబడి, కూలీల ఖర్చులు

సాధారణంగా రైతులు ఒక పంట కాలంలో ఒకే పంటను మాత్రమే సాగుచేయడం అందరికీ తెలిసిందే. కానీ ఏక కాలంలో ఒకే భూమిలో రెండేసి, మూడేసి పంటలను సాగు చేయడం పలమనేరు ప్రాంతంలో జోరందుకుంటోంది. అంతర పంటల సాగుతో ఆదాయం కళ్లజూస్తున్నారు. ఇప్పటి వరకూ కేవలం మామిడి తోటలున్న రైతులు ఏడాదికోసారి పంటను విక్రయించాలి. ఈ పర్యాయం మామిడిలో తీవ్రమైన నష్టాలు తప్పలేదు. ఈ తరుణంలో అదే తోటలో ఇతర పంటలనూ సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నారు. మామిడి తోటలోనే ఏడాదికి మూడు కాయగూర పంటలను పండిస్తూ ఏడాదికొచ్చే మామిడి ఆదాయంతో పాటు అంతకు మూడు రెట్ల ఆదాయాన్ని గడిస్తున్నారు.

పలమనేరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి విస్తీర్ణం 60 వేల హెక్టార్లుగా ఉంది. ఇందులో నీటి సౌకర్యం ఉన్న తోటలు 30వేల హెక్టార్లు. మూడేళ్లుగా మామిడి తోటల్లో ఇతర పంటల సాగు క్రమేణా పెరుగుతూ ప్రస్తుతం 6 వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగుచేస్తున్నట్టు ఉద్యానవనశాఖ తెలిపింది. ఏటా మామిడి ఫలసాయంతో పాటు అంతరపంటల కారణంగా రెట్టింపు ఆదాయం ఖచ్చితంగా పొందుతున్నారు. దీంతో రైతులు మామిడిలో అంతర పంటలుగా బీన్సు, టమాట, వంగ, బెండ, పసుపు, మిరప లాంటి అంతర పంటలను పండిస్తున్నారు. పప్పు ధాన్య పంటలైన అలసంద, జీలుగ, పెసర, మునగలతో పాటు తక్కువ వ్యవధి పంటలైన ఆకుకూరలను సైతం సాగుచేస్తున్నారు.

సాధారణ పంటల్లో ఇది కాంబినేషన్

బొప్పాయిలో బీన్సు, కొత్తిమీర, ధనియాలు, వెల్లుల్లి, మిరపలో అరటి, టమాటలో కాకర, దోస, తీగ బీన్సు, దోస, బీర తదితరాలను సాగు చేస్తున్నారు. బంతిపూలలో దోస, కొత్తిమీర, బెండ, బీన్సు, టమాట, వంగలో బంతి, టమాటలో కాకర లాంటి కాంబినేషన్లు రైతులకు లాభసాటిగా మారాయి. కొందరు రైతులు బొప్పాయిలో బంతి, మిరపలో అరటి, బంతిలో అలసంద, క్యాబేజిలో వెల్లుల్లి, కొత్తిమీర సాలుపంటగా జొన్నలను పండిస్తున్నారు.



తొప్పనపల్లె వద్ద బొప్పాయిలో బంతి సాగు

ఈ విధానాలతో బహుళ లాభాలు

పంటల సాగుకు అవసరమైన భూసారానికి సేంద్రియ ఎరువులు, నీటి వినియోగం, కూలీలు, క్రిమి సంహారక మందుల ఖర్చు తగ్గుతుంది. ముఖ్యంగా పంటకాలం ఆదా అవుతుంది కాబట్టి ఏటా మూడు పంటల్లో రెండు, మూడు పంటలను మిశ్రమ, అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చు. దీంతో ఓ పంటకు ధర తగ్గినా మరో రెండు పంటలకు ధరలుండే అవకాశం ఉంటుంది. ఫలితంగా రైతుకు నష్టాలు రావు. అందుకే రైతులు భిన్నంగా ఆలోచించి మిశ్రమ పంటలవైపు దృష్టి సారించారు.

టమాట రైతులకు ఇదో వరం

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో టమాట ఎక్కువగా సాగవుతోంది. అయితే టమాట ధరలు ఇప్పుడు బాగానే ఉన్నా ఏ సీజన్‌లో ధరలెలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఎకరా పొలంలో టమాటను సాగు చేసేందుకు లక్ష రూపాయల వరకూ సాగుకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పంట దిగుబడి మధ్యలో ఉన్నప్పుడు ఇదే పొలంలో తీగపంటలైన బీన్సు, బీర, కాకర, సొర లాంటి పంటలను సాగుచేస్తే టమాట పంట ఒడగ్గానే అదే కర్రలకు రెండో పంట తీగలను పెట్టుకోవచ్చు. ఫలితంగా పంట పెట్టుబడి తగ్గడంతో పాటు భూమిని కొత్త పంటకు సిద్ధం చేసే ఖర్చు కూడా తగ్గుతుంది. టమాట ధర లేనప్పుడు నష్టాన్ని చూసే రైతులకు రెండో పంట ఆసరా ఉంటుంది.



తొప్పనపల్లె వద్ద మిరపలో అరటి



మామిడిలో అంతర పంటగా సాగు చేస్తున్న టమాట

నూతన వ్యవసాయ పద్ధతుల వైపు మొగ్గు చూపాలి



అంతర పంటలుగా కూరగాయ పంటలు, పూలు ..ఇలా వేటిని సాగు చేసినా భూమిలో అదే సత్తువతో పంటల సాగు చేయవచ్చు. రెండు, మూడు రకాల పంటలున్నపుడు రైతులకు ఖచ్చితంగా ఏదో పంట ఆదుకుంటుంది. తక్కువ ఖర్చుతో సాగుచేస్తూ నాలుగు రకాలా ఆదాయాన్ని పొందవచ్చు. ఇప్పుడు రైతులు భిన్నంగా ఆలోచించి వ్యవసాయంలో ఆదాయం పొందడానికి దృష్టి సారించడం శుభ పరిణామం.

–డాక్టర్ కోటేశ్వరరావు, హార్టికల్చర్ ఏడీ, పలమనేరు

నోటీస్ బోర్డు

నేటి నుంచి దాదేపల్లెలో ఉరుసు

చౌడేపల్లె: దాదేపల్లెలోని హజ్రత్ సయ్యద్ పీర్ మషాయఖ్ బహదూర్ అలీషా బాబా దర్గాలో ఈ నెల 28, 29 రెండురోజుల పాటు ఉరుసు నిర్వహిస్తున్నట్లు ముస్లిం మత పెద్దలు తెలిపారు. 28న గంధం, 29 ఖవ్వాలీ, 30న తహలీల్ ఫాతెహాతో ఉరుసు ముగుస్తుందన్నారు.

వైద్యాధికారిణిగా డాక్టర్ మూనా



డాక్టర్ మూనా

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వాసుపత్రి డాక్టర్‌గా మూనా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి అమ్మడుగూరు పీహెచ్‌సీ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్ బదిలీపై ముడిపాపనపల్లెకు వెళ్లారు. ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్యసేలందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

మరో ఇద్దరు..



గంగులమ్మ



సుమతి

స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం పీహెచ్ఎన్‌గా గంగులమ్మ, సూపర్‌వైజర్‌గా సుమతి బాధ్యతలు స్వీకరించారు. గంగులమ్మ రాయచోటి నుంచి, చిన్నతిప్పసముద్రం నుంచి సుమతి ఇక్కడిక బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న పీహెచ్ఎన్ కృష్ణవేణి శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ పీహెచ్‌సీకి, సూపర్‌వైజర్ జమున రాయలపేట పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు.

14వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల దీక్షలు



పుంగనూరులో మున్సిపల్ కార్మికుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న మున్సిపల్ చైర్మన్ అలీంబాషా

పుంగనూరు (చౌడేపల్లె): కూటమి ప్రభుత్వం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ అలీంబాషా డిమాండు చేశారు. సమస్యల పరిష్కారానికి కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 14వ రోజుకు చేరుకుంది. కార్మికులు ఉదయం విధులకు హాజరై సమస్యల సాధన కోసం దీక్షలు చేస్తున్నారు. వారికి సంఘీభావంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. అలాగే కార్మికులకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని డిమాండు చేశారు. ఓ వైపు విధులు హాజరవుతూనే శాంతియుతంగా దీక్షలు చేయడం అభినందనీయమన్నారు. ఇకనైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఉద్యోగ విరమణ సన్మానం



వెంకట రమణారెడ్డిని సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: ఉపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేసిన వెంకటరమణారెడ్డి సేవలు వెల కట్టలేనివని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ప్రస్తుతించారు. శుక్రవారం మండలంలోని గందారుమాకులపల్లె జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి ఉద్యోగ విరమణ పురస్కరించుకుని వీడ్కోలు సన్మానం చేశారు. ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మన్ హాజరయ్యారు. చైర్మన్, టీచర్లు ఆయన సేవలను కొనియాడారు. ఏ ఊరిలో పనిచేసినా నిబద్ధతతో విధులు నిర్వర్తించారని శ్లాఘించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బిజిగానిపల్లె గ్రామస్తులు

మంచినీటి కోసం ఆందోళన

గుడుపల్లె: మంచి నీటికోసం బిజిగానిపల్లె మహిళలు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, వారం రోజులుగా నీటి కోసం గ్రామంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కరెంట్ ఉన్న సమయంలో వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీయాల్సి వస్తోందని, కూలీ పనులు వదులుకుని అక్కడ నీళ్ల కోసం వేచి ఉండాల్సి వస్తోందన్నారు. గ్రామానికి ఉన్న బోరులో పూర్తిగా నీళ్లు అడుగంటిపోవడంతో తాగునీటి కష్టాలు మొదలయ్యాయని, అధికారుల దృష్టికి సమస్యను నివేదించినా పట్టించుకున్న పాపానపోలేదని విమర్శించారు. అందుకే తాము మండల పరిషత్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. రెండ్రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని కార్యాలయ అధికారులు హామీఇవ్వడంతో గ్రామస్తులు వెనుదిరిగారు.





జూపల్లె వద్ద ఏనుగులు ధ్వంసం చేసిన డ్రిప్ పైపులు, కోటపల్లె సమీపంలో విరిచేసిన మామిడి కొమ్మలు

మళ్లీ ఏనుగుల దాడి

- డ్రిప్ పైపులు, మామిడి చెట్లు ధ్వంసం

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాళెం పంచాయతీలో శుక్రవారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు పంటలపై పడి నష్టం కలిగించాయి. పంచాయతీలోని జూపల్లె, కోటపల్లె సమీపంలోని మునస్వామి, వెంకటముని పొలాల్లోని మామిడి చెట్ల కొమ్మలను విరిచేశాయి. కాయలను ఆరగించాయి. డ్రిప్ పైపులు ధ్వంసం చేసి భారీ నష్టం కలిగించాయి. నెల రోజులుగా ఈ పరిసర ప్రాంతాల్లోనే తిష్ట వేసిన ఏనుగులు రోజూ ఎక్కడో ఒకచోట పంటలకు నష్టం కలిగించడం పరిపాటిగా మారింది. దీంతో రైతన్నల కంటికి కునుకు కరువైంది.

తిరుమలకు పాదయాత్ర



పాదయాత్రగా బయలుదేరిన భక్తులు

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని గరుడ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కాలినడకన సుమారు 200 మంది భక్తులు తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. స్థానిక శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం తిరుమలకు కాలినడకన బయల్దేరారు. 30న తిరుమలకు చేరుకుని స్వామి వారిని దర్శించుకుంటామని భక్తులు చెప్పారు.

సారా స్వాధీనం : ముగ్గురిపై కేసు



మల్లేష్

కుప్పం రూరల్: సారా స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. సీఐ కథనం.. మోట్లచేను నుంచి బరుగూరు తరలించేందుకు 10 లీటర్ల సారా కలిగి ఉన్న మల్లేష్‌ను మోట్లచేను బస్టాండు వద్ద ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్ట్ చేశారు. ప్రాథమిక విచారణలో ఇతనికి మారెమ్మ కొట్టాలు గ్రామానికి చెందిన అయ్యప్ప, వెంకటేష్ సారా సరఫరా చేశారని తేలింది. వారి కోసం గాలిస్తున్నారు. కుప్పం నియోజకవర్గంలో ఎక్కడైనా సారా తయారు చేసినా, విక్రయించినా తమ దృష్టికి తేవాలని ఎక్సైజ్ సీఐ కోరారు. ఏదైనా సమాచారం తెలిస్తే 9885399789, 9441949568 నెంబర్లకు ఫోన్ చేసి చెప్పాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యం ఉంచుతామన్నారు.

కార్మికులకు గుర్తింపు కార్డులు ముఖ్యం

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని కార్మికులు గుర్తింపు కార్డుల కోసం నమోదు చేసుకోవాలని లేబర్ ఆఫీసర్ మధుబాబు కోరారు. శుక్రవారం పట్టణంలోని కొత్తయిండ్లులో ఆయన కార్మికులతో సమావేశమయ్యారు. కార్మికులకు ఉద్దేశించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. గుర్తింపు కార్డుల వలన కలగే ప్రయోజనాలను తెలియజేశారు. దరఖాస్తు చేసుకున్న 300మంది కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఇప్పటికీ దరఖాస్తు చేసుకోని వారు ఉన్నపక్షంలో జాప్యం చేయకుండా దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా కార్డుల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకుడు మురుగప్ప, కార్మికులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న లేబర్ ఆఫీసర్ మధుబాబు

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేసి రాహుకాల సమయంలో అర్చనలు ,అభిషేక పూజల అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, రంగు రంగు పూలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉచిత అన్న ప్రసాదాలను ఈఓ పంపిణీ చేశారు.

ఉద్యోగుల దీక్షకు వైఎస్సార్‌సీపీ మద్దతు



కార్మికుల దీక్షకు మద్దతు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు

చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వం మునిసిపల్ కార్మికులను సైతం మోసం చేసి పబ్బం గడుపుకుంటోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు కార్పొరేషన్ ఇన్‌చార్జ్ హరిణిరెడ్డి దుయ్యబట్టారు. ఐదు రోజులు మునిసిపల్ కార్మికులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వానికి ఏమాత్రం స్పందించడం లేదని విమర్శించారు.. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ విభాగం ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చేస్తున్న దీక్షకు వైఎస్సార్‌సీపీ నేతలు సంఘీభావం ప్రకటించారు. హరిణిరెడ్డి మాట్లాడుతూ, కోవిడ్ లాంటి క్లిష్ట పరిస్థితుల్లో మునిసిపల్ ఉద్యోగులు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. అలాంటి కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం, ప్రోత్సాహకాలు మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, ఇకనైనా వారి డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ నరసింహ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. కార్మిక సంఘ నాయకులు శరవణ మాట్లాడుతూ, పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా ఇంటి అద్దె, పింఛను ఇవ్వడంతోపాటు విధి నిర్వహణలో కార్మికులు మృతి చెందితే రూ.10 లక్షలు, అంగవైకల్యానికి గురైతే రూ.5 లక్షల పరిహారం ఇవ్వడం, కుటుంబలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడం లాంటి కనీస కోర్కెలను ప్రభుత్వం తీర్చాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు పుష్పలత, షర్మిల, మధుబాబు రెడ్డి, భాగ్యలక్ష్మిరెడ్డి, పూమణి, పార్టీ నేతలు నారాయణమూర్తి, ఆను, మనోహర్‌రెడ్డి, వేమారెడ్డి, మధు, కార్మిక సంఘ నాయకులు శివకుమార్, శివప్రసాద్, వెంకటేష్, హరికృష్ణ, సునీల్‌కుమార్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మామిడి కష్టాలు

- రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే ప్రభుత్వ మద్దతు ధర
- గిట్టుబాటు ధర లేక తోటల్లో వదిలేస్తున్న కాయలు

గంగవరం: రైతులకు మామిడి కష్టాలు అధికమయ్యాయి. గిట్టుబాటు ధర లేకపోవడంతో మామిడి ఫలసాయం విక్రయించలేక రైతులు సతమతమవుతున్నారు. కొందరైతే మామిడికి సరైన ధర లేక కాయలు కోయకుండా తోటలోనే వదిలేశారు. మండలంలో మొత్తం 1295.95 హెక్టార్ల భూమిలో మామిడి తోటలు ఉన్నాయి. ప్రధానంగా వీటిలో తోతాపురి, బేనీషా, నీలం, మల్లిక, ఆల్ఫాన్సో..ఇలా వివిధ మామిడి రకాల చెట్లు ఉన్నాయి. ఈ ఏడాది అన్ని రకాల మామిడి ఫలాలకు సరైన ధర లేకపోవడంతో తోటల్లో కాయలు కోయకుండా అలాగే వదిలేశారు. దీంతో మామిడి రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. మరోవైపు మామిడికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినా అది అందడం గగనమవుతోంది. పైగా, ఎవరైతే పంట నమోదు చేసుకున్నారో వారికే మద్దతు ధర ఇవ్వాలని సవాలక్ష నిబంధనలు రైతులకు ప్రతిబంధకమయ్యాయి. మండీల వద్ద కిలో మామిడికి రూ.2, రూ.3 మించి ఇవ్వడం లేదు. అయినా మండీల వద్ద ట్రాక్టర్ల లోడుతో వచ్చిన మామిడి రైతులు పడిగాపులు కాయడం, కూలీ ఖర్చులు కూడా గిట్టుబాటు కాకపోవడంతో కుదేలవుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



గిట్టుబాటు ధర లేక తోటలో కోయకుండా వదిలేసిన మామిడి కాయలు

రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి



తమ తోటల్లో తోతాపురి మామిడి కోసే రైతులు ముందుగా పలు ధృవ పత్రాలను రైతు సేవా కేంద్రాల్లో అందజేసి ముందుగా నమోదు చేసుకోవాలి. ఎవరైతే నిజమైన రైతులు ఉంటారో వారికి మాత్రమే ప్రభుత్వ మద్దతు ధర రూ. 4 చెల్లిస్తారు.

–వరప్రసాద్, ఉద్యాన అధికారి